

# డాక్టర్‌గారి భార్య

## – కొమ్మూరి వేణుగోపాలరావు



(పునర్ముద్రణ)

### (ప్రారంభం)

**సహజ గదిలోకి అడుగుపెట్టింది.**

తలుపులు తెరిచే వున్నాయి.

కిటికీ దగ్గర నిలబడి బయట చీకట్లోకి, ఆ చీకట్లో ఉవ్వెత్తు నీడల్లా కనిపించే చెట్లవంక అనాసక్తంగా చూస్తున్న డాక్టర్ నరేష్ అలికిడి విని ఇటుకేసి తిరిగాడు.

"తలుపులు వెయ్యవేం?" అన్నాడు చిరునవ్వుతో.

"ఎందుకు?" అన్నది సహజ చిలిపిగా.

"మరి వేస్తారుగా"

"ఎవరూ లేరుగా వెయ్యెటానికి"

"ఎక్కడికి వెళ్ళారు?"

"సినిమాకి"

"ఎందుకు?"

"మనిద్దర్ని ఒంటరిగా విడిచిపెట్టాలని"

"నేను వేస్తాను" అని తలుపు దగ్గరకి వచ్చాడు.

"ఎందుకు?"

"వెయ్యాలిగా?"

"ఇంట్లో ఎవరూ లేరుగా."

"అయినా అదోలా ఉంటుంది" అని తలుపు గడియపెట్టాడు.

ఆమె మౌనంగా నిలబడి ఉంది. తెల్లచీర, నల్లజాకెట్టు వేసుకుంది. జుట్టు వొదులుగా విప్పారి, నిడివిగా నడుం క్రిందదాకా కళ్ళకి కాటుక లేదు, తల్లో పువ్వులు లేవు. చేతులకి ఒకటో రెండో గాజులు, మెళ్ళో మంగళసూత్రం తప్ప ఇంకేం లేవు. అయినా ఆమె ముఖంలో ప్రతి అవయవంలో సహజ సౌందర్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది.

ఆమె భుజాల మీద చేతులు వేసి కళ్ళలోకి చూస్తూ అన్నాడు, "నీతో ముఖ్య విషయం చెప్పాలి."

"చెప్పండి వింటాను."

"నువ్వు కంగారు పడకూడదు."

"పడను."

"విని నీ గుండె చెదిరిపోకూడదు."

"అంత తేలిగ్గా చెదిరిపోదు."

"ఒకవేళ వినకూడని వార్త వింటే?"

"అయినా సరే."

"అంత గట్టిదా నీ గుండె."

"మీరనుకున్న దానికంటే కొంచెం ఎక్కువే."

"పాపం మొదటిరాత్రి, కోరి పెళ్ళిచేసుకున్నావు. ఒక విచారకరమైన విషయం ఇప్పుడే చెప్పాల్సి వస్తోంది. అదేమంటే నువ్వు నా రెండో భార్యవు."

ఆకాశం ఉరుముతుందనీ, పిడుగులు పడతాయనీ, లేకపోతే భూకంపంలాంటిది వొస్తుందనీ సహజంగా ఎవరైనా ఎదురుచూస్తారు.

కానీ సహజ నవ్వింది చాలా తేలిగ్గా నవ్వింది. తన రెండు చేతులూ అతని భుజాలమీద వేసి కళ్ళలో కళ్ళు పెట్టి చూసింది.

"ఓష్! అంతేనా?" అంది.

అతను అదిరి పడ్డాడు.

"మొదటి భార్యనై బాధ్యతను పెంచుకోవటం ఇష్టంలేదు, రక్షించారు."

అర్ధరాత్రి దాటి ఉంటుంది. పైన ఫ్యాన్ గిర్రున తిరుగుతోంది. సహజ గోడవైపు తిరిగివుంది. అలసటగా, నిర్మలంగా నిద్రపోతున్నారిద్దరూ. అతని చెయ్యి ఆమె హృదయం చుట్టూ చుట్టుకుని ఉంది. ఆ చెయ్యి కొంచెం కదిలేసరికి ఆమె కళ్ళు విప్పింది. ఆమె ముఖం కనబడకపోయినా అతనికి అర్ధమైంది.

"సహజా?" అన్నాడు.

"నీకు కోపం రాలేదేం?"

"ఎందుకు?"

"నువ్వు నా రెండో భార్యవైనందుకు."

"చెప్పానుగా! నా బాధ్యత తగ్గిందని."

"అది పై పై మాట. అంత అతీతంగా వుంటోందని నేను నమ్మను."

"నా గురించి మీకు తెలీదు. ఇరవైరెండేళ్ళ నేనూ, పాతికేళ్ళకు పైగా మీరూ ఒకరితో ఒకరు సంబంధం లేకుండా ఎవరి దారిన వారు వెలిగాం. నా గురించెలా తెలుస్తుంది చెప్పండి."

"పోనీ, మొదటి భార్య ఎవరని అడగవేం?"

"ఎందుకడగాలి? అవసరమయితే మీరే చెబుతారుగా."

"తెలుసుకోవాలని లేదా?"

"లేదు,ఇతరుల పర్సనల్ విషయాలు తెలుసుకోవాలని ఉండదు."

"కాని నేను ఇతరుడ్ని కాదు."

"పర్సనల్ విషయాలవరకూ వచ్చేసరికి ఇతరులే"

"నువ్వు చాలా పెంకిదానివి."

ఆమె అతని చెయ్యి గుండె మీదనుంచి తీసి ఇటుకేసి తిరిగింది. ఇప్పుడు ఒకరి ముఖం ఒకరికి ఎదురెదురుగా వుంది. బెడ్‌లైటు వెలుగులో ఇద్దరి కళ్ళూ వింతగా మెరుస్తున్నాయి.

అతని ముఖంలోకి చూస్తూ ఆమె నవ్వింది. "అవును. పెంకెదాన్ని అందుకనే అందరి ఇష్టాన్నీ కాదని మిమ్మల్ని పెళ్ళిచేసుకున్నాను."

సహజ ఇంటర్మీడియట్ ఫస్ట్‌క్లాస్‌లో ప్యాసయింది వట్టి ఫస్ట్‌క్లాసేకాదు డిస్టిన్షన్. నూటికి ఎనభై పైగా మార్కులొచ్చాయి. ఆమె చిన్నప్పట్నుంచీ డాక్టరు కావాలని ఆశయం. ఆమె తండ్రి డాక్టరు. బాగా పేరున్న డాక్టరు.

ఆమెకు బాగా గుర్తుంది. ఆమె ఎనిమిదేళ్ళ వయసులో వున్నప్పుడు నలభయి ఏళ్ళు పూర్తిగా దాటని తండ్రికి హార్ట్ ఎటాక్ వొచ్చింది. ఆపదలో కూడా పరామర్శించటానికి వచ్చినవాళ్ళు మాటల మధ్యలో వాళ్ళ వాళ్ళ బాధలు చెపితే ఆయన ట్రీట్‌మెంట్ ఇచ్చి పంపిస్తూ వుండేవాడు. మాట్లాడవద్దంటే వూరుకునేవాడు కాదు.

కొంతమంది తమకు కాస్త జబ్బు చేస్తే చిలవలు పలవలుగా వచ్చిన వాళ్ళందరికీ అదే వల్లిస్తూ వుంటారు. ఆయన తన గురించి చెప్పుకోక ఆ దశలో కూడా ఎదుటివాళ్ళ బాధల గురించి అడిగేవాడు. ఆరోగ్యం గురించి పట్టించుకోక పోవటం వల్లా, సెకండ్ ఎటాక్ వచ్చినా శ్రద్ధ తీసుకోకపోవటం వల్ల అకాల మరణానికి లోనయినాడు.

అప్పట్నుంచీ వాళ్ళ కష్టాలు మొదలయినాయి. డాక్టరుగా అప్పటికి సంపాదించిందాంట్లో ఏమీ మిగుల్చుకోలేదు. ఆమె తల్లి ఒక్కగానొక్క కూతురితో సహా పుట్టింటివారి మీద ఆధారపడాల్సి వొచ్చింది. నాలుగయిదేళ్ళు గడిచేసరికి వైరల్ ఫీవర్‌లో టాక్సీమియా వొచ్చి తల్లికూడా చనిపోయింది.

మేనమామల, అత్తయ్యల దయాదాక్షిణ్యాలమీద బ్రతుకుతూ సహజ పెరిగి పెద్దదైంది ఆమె చదువుకు ఎప్పుడూ ఆటంకమే. మేనమామల భార్యలు చీటికీ మాటికీ పిలిచి ఏదో పని చెబుతూవుండేవారు. స్కూల్‌కి, ఆ తర్వాత కాలేజికి ఎప్పుడూ టైములో వెళ్ళనిచ్చేవారుకాదు. ఒకసారి రోగం, ఒకసారి ఇంట్లో ఏదో అర్థంలేని వేడుక, ఒకసారి వూళ్ళు వెళ్ళి ఆమెని ఇంట్లో అట్టేపెట్టటం – ఒకరకంగా కాల్చుకు తినేవాళ్ళు – అయినా ఆమె కష్టపడి చదివి ఇంటర్ ప్యాసయింది.

ఆమెకెప్పుడూ తండ్రి డాక్టరుగా హుందాగా అటూ ఇటూ తిరగడం గుర్తువచ్చేది. ఆ రూపమే ఎప్పుడూ కళ్ళముందు మెదుల్తూ వుండేది. తల్లి సరైన వైద్య సదుపాయం లేక చనిపోవటం ఎప్పుడూ మనసులో మెదిలేది. తను డాక్టరవాలి, డాక్టరవాలి. ఎప్పుడూ ఇదే యావ.

"ఇహ చదివించలేం చదివిన చదువు చాలుగాని ఇహ పెళ్ళి చేసుకుని కాపురం అఘోరించు" అన్నారు అత్తలూ, భార్యలమాట కెదురు చెప్పలేని మేనమామలూ దానికి వంత పాట పాడారు. సహజ వొప్పుకోలేదు. మెడికల్ ఎంట్రెన్స్‌కి ఎపియరవుతానంది. వాళ్ళు ఆమెకు ఎటువంటి సౌకర్యాలూ కలిగించలేదు. ఏ పుస్తకాలూ కొనివ్వలేదు. ఏ కోచింగ్ సెంటర్‌లోనూ చేర్చలేదు.

ఎలాగో తిప్పలుపడి ఆ స్నేహితురాలి దగ్గరో పుస్తకం, యీ స్నేహితురాలి దగ్గరో పుస్తకం ఎరువు తెచ్చుకుని రాత్రింబవళ్ళు కఠోర దీక్షతో చదివింది ఎంట్రన్స్ రాసింది. బాగానే ఆన్సర్ చేసింది కాని కొన్ని ప్రశ్నలర్థం కాలేదు. పేపర్‌లో రిజల్ట్స్‌లో ఆమె నెంబరు లేదు. మార్కులొచ్చాక రెండు మార్కుల్లో పోయినట్లు తెలిసింది. అయినా ఆమె అధైర్యపడలేదు.

ఒక ఏడాది ఇంట్లో పనిపాటులు చేస్తూ, సూటిపోటి మాటలు ఎదుర్కొంటూ రెండోసారి ఎపియరయింది. ఈసారి తప్పకుండా సీటు వస్తుందనుకుంది. ఒక మార్కులో పోయింది.

ఆమె అత్తలు ఎగతాళి చేశారు. ఇంటికొచ్చిన వాళ్లందరితో అపహాస్యంగా మాట్లాడారు. కొత్తవాళ్ళకి పదిమార్కులు తక్కువొస్తే ఒక మార్కులు తక్కువొచ్చిందని చెప్పుకుంటుందనేవారు. సహజ విని అన్నీ భరించింది.

ఆమెకు మామూలుగా తనని తాను బయటపెట్టుకోవటం మొదట్నుంచీ అలవాటులేదు. ఏం చెయ్యాలి? తన వారంటూ ఎవరూ లేరు? మెడలో స్టెతస్కోప్ వేసుకుని, అటూ ఇటూ తిరుగుతూ, పేషెంట్స్‌ని పలకరిస్తూ, వాళ్ళ బాధల్ని తీరుస్తూ, వారికి ఉపశమనం కలిగిస్తూ జీవితం ధన్యం చేసుకోవాలని ఆమెకు ఆకాంక్ష. ఆమె కనే కల. అదెప్పటికైనా నెరవేరుతుందా? మళ్ళీ పట్టుదలతో చదవటం మొదలుపెట్టింది.

కాని యీసారి చదువు సాగటంలేదు. ఇంట్లో చాకిరీ ఎక్కువైపోయింది. పరీక్షలముందు ఆమె అత్తకు ఏదో రోగం ముంచుకొచ్చింది. ఆమెకు ఊపిరి ఆడటంలేదు. అత్త ఆమెని అటూ ఇటూ మెదలనివ్వటంలేదు. చివరకు ఆమె ఎపియర్ అవకుండానే ఎంట్రెన్స్ పరీక్షలు జరిగిపోయాయి. ఆమెకి ఏడుపొచ్చింది. తల నేలకేసి బాదుకోవాలనిపించింది.

చిన్నతనానే సంభవించిన తల్లిదండ్రుల మరణం వల్ల రెండు మూడేళ్ళు స్కూల్ ఎడ్యుకేషన్ పోయింది. అందుకని యీ మూడో అవకాశం కూడా చెయ్యి జారిపోయాక ఆమె వయస్సు ఇరవై రెండు నిండి ఇహ భవిష్యత్తులో ఎంట్రెన్స్‌కు ఎదురయ్యే ఛాన్స్ లేకుండా పోయింది.

చిత్రంగా పరీక్షల టైము దాటిపోయాక ఆమె అత్తకు సుస్తీ తగ్గిపోయింది. కానీ ఆమెను అటెండ్ అవటానికి వచ్చే డాక్టరు ఆమెను పరీక్షగా చూసేవాడు. ఎందుకో ఆమె ఆయనకు నచ్చింది. ఒకసారి వీలు చూసుకుని అన్నాడు. తమకు తెలిసిన ఓ కుర్రాడున్నాడని, డాక్టరు ప్యాసయి. హౌస్‌సర్జన్ కూడా పూర్తిచేశాడనీ, బహుశా కొద్దిరోజుల్లో ప్రాక్టీస్ పెట్టుకోబోతున్నాడనీ, అతనికి సహజనిచ్చి పెళ్ళిచేస్తే బాగుంటుందనీ..

ఆయన అభిప్రాయం విని అత్తలు నవ్వారు ."దీని మొహం, దీనికి డాక్టరు మొగుడేమిటి? చిన్నప్పుడే తల్లీతండ్రినీ పొట్టను పెట్టుకున్న దీనికి అంత అదృష్టం కూడానా? ఏ గుమాస్తానో దొరికితే గొప్పే" అని అభిప్రాయం వెలిబుచ్చారు.

"అయినా ప్రయత్నించి చూస్తే తప్పేంటి?" అని ఆయనే శ్రద్ధ తీసుకుని, చివరకు పెళ్ళిచూపులు జరిగేటట్లు చూశాడు.

అబ్బాయికి అమ్మాయి నచ్చిందిట.

"నచ్చితే మాత్రం, ఎం.బి.బి.ఎస్ ప్యాసయిన వాడికి బోలెడు కట్నాలు పొయ్యవద్దూ మనకేమన్నా సాధ్యమయ్యే పనేనా?" అన్నారు అత్తలు.

"కట్నం అక్కర్లేదు."

ఇహ సహజ మనసు విరవటానికి ప్రయత్నించారు. అబ్బాయికెవరూ లేరు, ఆస్తిపాస్తులు లేవు. అయినా క్యారెక్టర్ మంచిదికాదట.

ఏమయినాసరే, సహజ అతన్నే చేసుకుంటానంది. తను డాక్టరుకాలేకపోయింది. కాని కనీసం డాక్టరు భార్యనన్నా కావాలి. పరోక్షంగా తన ఆశయం నెరవేర్చుకోవాలి.

ఆ పెళ్ళిని ఏ ప్రతికూల శక్తి ఆపలేకపోయింది. పెళ్ళి జరిగిపోయింది.

"మీరు ఎం.డి ఎందుకు చదువుకోలేదు?" అన్నది సహజ అతని క్రాపుని సరిచేస్తూ."

"ఒకసారి ట్రై చేశాను. సీటు రాలేదు. మళ్ళీ మళ్ళీ చెయ్యటానికి ఆర్థికంగా శక్తిలేదు. కాని.."

"ఆగిపోయారేం?"

"ఎం.బి.బి.ఎస్ గానే జీవితం గడపాలంటే బాధగా వుంది."

"ఏం?"

"నాలెడ్జి చాలదు. పేషెంట్స్‌లో కాన్ఫిడెన్స్ క్రియేట్ చెయ్యడం కష్టం. కాంపిటీషన్‌లో నిలబడటం కష్టం. ఇది పోటీయుగం. సాదా డాక్టరుగా గడిపెయ్యొచ్చు. కాని ఏదో సాధించాలనుకునే వాడికి ఆ థ్రిల్ చాలదు. ఒక డాక్టరుగా పరిపూర్ణమైన జీవితం గడపాలంటే యీ రోజుల్లో డిగ్రీ చాలదు."

"సరిపోతుంది."

అతనాశ్చర్యంగా ఆమె ముఖంలోకి చూశాడు.

"మిమ్మల్ని, పరిపూర్ణమైన డాక్టరుగా రూపొందేటట్లు, ఏ ఎం.డీకీ తీసిపోనట్లు రూపొందించడంలో నేను సహకరిస్తాను. ఈ పోటీలో ఓడిపోకుండా, నిలబడేటట్లు చేస్తాను ఓ.కే?"

ఆప్యాయంగా, ఎంతో ఆనందంగా, గర్వంగా అతనామెను దగ్గరకు తీసుకున్నాడు.

ఇద్దరి దగ్గరా డబ్బులేదు. ఆమె అతనికోసం సర్వస్వాన్నీ త్యజించి వచ్చింది. అతను యించుమించు అలాంటి జీవితం గడిపినవాడే ఉన్నదేదో ఎం.బి.బి.ఎస్ చదివేవరకూ సరిపోయింది. చిన్న యిల్లు అద్దెకు తీసుకున్నారు. అంత గొప్ప లొకాలిటీ కూడా కాదు. కాని అంతకంటే దొరకలేదు. అష్టకష్టాలూ పడి కొద్దిగా సామాగ్రి అమర్చుకున్నారు. ఒక ఎగ్జామినేషన్ టేబుల్, కన్సల్టేషన్ రూంలో ఒక టేబుల్, డాక్టరు కూర్చోవటానికి ఒక ఛెయిర్, ఎదురుగా కూర్చునే వారికోసం రెండు మూడు కుర్చీలు, పేషెంట్సు వెయిటింగ్ రూములో నాలుగయిదు బెంచీలూ, కన్సల్టేషన్ రూం ప్రక్కనే చిన్నగది. అందులో ఓ పొడవాటి టేబుల్, డ్రెస్సింగ్సుకీ, మైనర్ ఆపరేషన్స్‌కీ అదే. చాలా కొద్దిగా ఇన్‌స్ట్రుమెంట్స్, నాలుగయిదు సిరంజెస్, థర్మామీటర్, డ్రెస్సింగ్ సామాను, మైనర్ సర్జరీకి పనికొచ్చే పరికరాలు అతని హాస్పిటల్ తయారయింది. కష్టం మీద ఒక పదహారు పదిహేడు ఏళ్ళ కుర్రవాడు దొరికాడు. హాస్పిటల్ సర్దడానికి కాంపౌండింగ్ చేయడానికి ప్రస్తుతానికి అన్నీ అతనే. లోపల ఉన్న రెండు గదులు ఇద్దరు కాపురం ఉండటానికి కేటాయించుకున్నారు.

ఒక ఆర్భాటంలేదు, ఫంక్షనులేదు. చేయడానికి స్తోమత లేదు. చేయాలనే ఉద్దేశ్యంలేదు. మంచి ముహూర్తం చూసుకుని గోడకు బోర్డు మాత్రం తగిలించారు.

మొదటి రోజు హాస్పటల్‌లోకి వెళ్ళేముందు సహజ నరేష్‌కి కొన్ని పాఠాలు చెప్పింది.

"మీకు కోపం ఉండకూడదు."

"కోపం వస్తే?"

"రాకూడదు."

"రెండోది.."

"డబ్బు మీద మమకారం ఉండకూడదు."

"ఉంటే."

"పేషెంట్స్‌ని గట్టిగా డబ్బు అడగకూడదు."

"డబ్బు అడగకపోతే వాళ్ళిస్తారా?"

"మొదట పేరు రావాలి, దాని తరువాత డబ్బు అదే వస్తుంది. ఒకవేళ అంతగా రాకపోయినా ఫర్వాలేదు. మనకి సరిపోయినంత వస్తే అదే చాలు."

అతను సీట్లోకి వెళ్ళి కూర్చున్నాడు. మొదటి రోజంతాఎదురు చూసినా నలుగురయిదుగురు పేషంట్సుకన్నా రాలేదు. అతను బాధపడనూ లేదు. ఎందుకంటే తనసలు ప్రాక్టీసు పెట్టినట్లు ఎవ్వరికీ తెలియలేదు కదా! ఒకటి 'ఎమీబియాసిస్' కేసు ఈ దేశంలో ప్రతి ముగ్గురిలో ఒకరికి 'ఎమీబియాసిస్' ఉంటుంది. మనం త్రాగేనీళ్ళు తీసుకునే ఆహారం పుష్కలంగా రోగం రావడానికి దోహదం చేస్తాయి. అయితే అందరిలో ఒకే రకం లక్షణాలు ఉండవు. ఓపిగ్గా, జాగ్రత్తగా పేషంటు హిస్టరీ తీసుకోవాలి. ట్రీట్‌మెంటుకూడా బలీయంగా ఇవ్వాలి. లేకపోతే పూర్తిగా తగ్గకపోవటం, తగ్గినా మళ్ళీ వస్తూ ఉండటం జరుగుతుంటుంది. రెండోది ఫీవర్ కేసు, మూడోది నీరసం, గుండెదడ. నాలుగోది కీళ్ళనొప్పులు అందులో ఇద్దరు డబ్బులిచ్చారు. ఇద్దరు తరవాత ఇస్తానన్నారు. ఆ ఇద్దరూ తరువాత ఎప్పుడైనా తారసపడ్డారో లేదో అతనికి గుర్తులేదు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS